క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందన



డ్రైవర్లు, కండక్టర్లను సత్కరిస్తున్న డీఎం షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన వారికి ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని డిపో మేనేజర్ షేక్ షబ్నం పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో ఆవరణలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లకు, ప్రతిభ కనబరిచిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికి డిపో గ్యారేజీలో ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందించి సత్కరించారు. కుంభమేళాకు స్పెషల్ బస్సుల్లో సేవలందించిన డ్రైవర్ ఏపీ రావు తదితరులను సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ నాగ లక్ష్మి, బస్‌స్టేషన్ మేనేజర్ మూర్తి, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

కడియం: పొట్టిలంక గ్రామానికి చెందిన పి.చిన్న (60) తనకు మనుమరాలు వరసయ్యే పదిహేడేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు సోమవారం కడియం పోలీసులు చిన్నపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత బాలిక తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి వేరే దేశంలో ఉంటోంది. బంధువుల ఇంటి వద్ద ఉంటున్న బాలికపై సదరు వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులు వివరించారు.

యురేకా సైన్స్ ఎక్స్‌పోలో జిల్లాకు ప్రథమస్థానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాస్థాయి సైన్సు ప్రయోగ పోటీల్లో ప్రథమస్థానాన్ని కైవశం చేసుకుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు సోమవారం తెలిపారు. పర్యావరణం సుస్థిర అభివృద్ధిలో ప్రథమ బహుమతిని సీతానగరం మండలం, రఘుదేవపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కే భానుతేజ, కే సత్యదుర్గ, నాగేంద్ర కుమార్ కైవసం చేసుకున్నారని తెలిపారు. ద్వితీయ బహుమతిని మున్సిపల్ హైస్కూల్ గాంధీపురం విద్యార్థులు కలిదిండి లహరి, కె.లతా జ్యోతికి దక్కాయని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రథమ బహుమతిని ఆనందనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.అనిరుథ్, ఎం.దివాకర్, పి.మహేష్, ద్వితీయ బహుమతి, గాంధీపురం మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.జ్యోతిలహరి, మండపరెడ్డి రమ్య దక్కించుకున్నారని అన్నారు. మూఢ నమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం విభాగంలో గాంధీపురం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాజేటి వాసవ్, మండ జాయ్ విజయం సాధించారని రవిబాబు తెలిపారు.

ఘనంగా షిర్డి సాయి మందిర వార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ కార్యాలయాన్ని ఆనుకొని ఉన్న శ్రీ షిర్డి సాయి మందిర 13వ వార్షికోత్సవ మహోత్సవాలు అద్దంకి వేంకటప్రభాకర శ్రీ రామచంద్రరావు నిర్వహణలో మూడు రోజులపాటు విజయవంతంగా కొనసాగాయి. సోమవారం ఈ వేడుకలు ఘనంగా ముగిసాయి. మాధురి నాదస్వర బృందం మంగళ వాయిద్యాల నడుమ మైలవరపు నారాయణ (ద్రాక్షారామం) బ్రహ్మత్వంలో, దెందులూరి శ్యామ్‌కుమార్ అర్చకత్వంలో విశేష అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసారు. వాకచర్ల భద్రమ్మ బృందం శ్రీ లలితాపారాయణం, కైకరం వాసి జటావల్లభుల రామమూర్తి విరాటపర్వంపై ప్రవచనం చేసారు. ఈ సందర్భంగా రామమూర్తి దంపతులను అద్దంకి వేంకటప్రభాకర శ్రీ రామచంద్రరావు, రావిపాటి మదన గోపాలస్వామి సత్కరించారు. రాయ్ కిషోరి కళాక్షేత్రం ఆధ్వర్యంలో కుమారి స్నేహజాన శిష్య బృందం కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు అలరించాయి.

కోలమూరులో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు శాఖ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సేవలు విస్తృతం చేయాలని, కోలమూరులో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రాంచిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం కోలమూరులో ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నాల్గవ బ్రాంచిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) మాట్లాడుతూ బ్యాంకుకు కోలమూరు బ్రాంచితో నాలుగు బ్రాంచీలకు చేరినట్లు తెలిపారు. ఈ బ్యాంకును దివంగత పాలకోడేటి గురుమూర్తి 1918లో స్థాపించారని ఇప్పటికి 107 వసంతాలు పూర్తి చేసుకుందని తెలిపారు. బ్యాంకు వివిధ విభాగాలను జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ శ్రీ గేడి పోతురాజు, సీఈవో శ్రీ పాలకోడేటి రమణకుమార్, ఇతర డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీ స్టాల్స్.. ఆసక్తి చూపని రైతులు

- దరఖాస్తుకు నేటితో ముగియనున్న గడువు
- 30 స్టాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటన
- 15 దరఖాస్తులు కూడా అందని వైనం



నర్సరీ స్టాల్స్‌కు కేటాయించనున్న ప్రదేశం

కడియం: మండలంలోని వేమగిరి నుంచి పొట్టిలంక వరకు కోటిపల్లి కెనాల్ - జాతీయ రహదారి మధ్యలోని ఖాళీ ప్రదేశంలో నర్సరీ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు 150 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లుగా ప్రకటించింది. తొలి విడతగా 30 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే రెండుసార్లు గడువు ఇచ్చారు. లాటరీ విధానంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకోసం నర్సరీ రైతాంగం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. 30 స్టాల్స్‌కు ఇప్పటి వరకు కేవలం 15 మంది కూడా దరఖాస్తులు అందజేయలేదు. రూ.5వేలు డీడీ రూపంలో చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేసింది. దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారంతో గడువు ముగియనుంది. 20 నుంచి 45 అడుగుల విస్తీర్ణంలో స్టాల్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తారు. స్టాల్ పొందిన తరువాత ఏడాదికి రూ. 6వేలు టూరిజం శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్ల పాటు ఏటా రెన్యువల్ చేస్తారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ఈ ప్రకటనలు, అధికారుల చెబుతున్న మాటలు ఏ మాత్రం ఆకట్టుకోలేకపోతున్నాయి.

అనేక సందేహాలు.. స్పందించని అధికారులు

నర్సరీ స్టాల్స్ ఏర్పాటుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా స్థలం కేటాయించేందుకు ముందుకు వచ్చాయి. అయితే నిర్ణీత విస్తీర్ణంలో ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందుకోసం స్టాల్ పొందిన రైతు ఎంత మొత్తం పెట్టుబడిగా పెట్టాల్సి వస్తుందో చెప్పడం లేదు. అంటే ప్రభుత్వం సూచించిన విధంగా స్టాల్‌ను ఏర్పాటు చేసేందుకు ఎన్ని లక్షల రూపాయలనైనా ఖర్చు చేయాల్సిందే. ఏటా రెన్యువల్ చేస్తూ మూడేళ్ల పాటు మాత్రమే కేటాయించే స్టాల్‌కు అంత మొత్తంలో పెట్టుబడి పెట్టడానికి రైతులు సందేహిస్తున్నారు. అంతేకాకుండా ఆ తరువాత కూడా ఈ విధానం అమలులో ఉంటుందా? అన్న సందేహం రైతులను వెంటాడుతోంది. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే టూరిజం శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ తరువాత వీటి నిర్వహణ, ప్రభుత్వానికి చెల్లింపులు తదితర అంశాలపై రైతుల నుంచి అనేక ప్రశ్నలు ఉన్నాయి. వీటికి స్పష్టమైన సమాధానాల్లేకుండా, కేవలం రైతుల ద్వారా ప్రచారానికి తోడ్పడుతుంది. వ్యాపారం వృద్ధి చెందుతుందంటూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సమీక్షల్లో ఊదరగొడుతున్నారు. అంతే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడం లేదన్న వ్యాఖ్యలు నర్సరీ రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రదేశంలో ఒక చోట విస్తీర్ణం ఎక్కువ, మరో చోట తక్కువగా ఉంది. పొట్టిలంక నుంచి వేమగిరి వరకు ఒకే విధంగా ఉండేలా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు తగినంత జాగా కనిపిస్తుంది. ఒక వేళ తక్కువ వెడల్పు ఉన్న ప్రదేశంలో స్టాల్స్ పొందిన రైతుకు ఇబ్బందులు తప్పవు. ఈ కారణంగా కూడా పలువురు వెనకడుగు వేస్తున్నారు.

రాత్రి వేళల్లో రక్షణ కరువు

జాతీయ రహదారిపై మొక్కలు, వాటికి సంబంధించిన వస్తువులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. రోడ్డు పక్కన ఈ విధంగా ఏర్పాటు చేస్తే రాత్రిపూట వాటి రక్షణ పరిస్థితి ఎలా అన్న సందేహాలున్నాయి. మొక్కలతో స్టాల్‌ను ఏర్పాటు చేసుకోవాలంటే, సదరు స్టాల్ రోజువారీ నిర్వహణ ఖర్చులు కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. స్టాల్ ఏర్పాటు చేయడం ద్వారా జరిగే వ్యాపారం, నిర్వహణ ఖర్చులు తదితర అంశాలను అంచనా వేస్తే తగినంత లాభదాయకంగా ఉండదన్న భావన ఎక్కువ మంది రైతుల నుంచి వ్యక్తమవుతోంది. దీనికి తోడు ప్రస్తుతం స్టాల్స్ ఏర్పాటు చేయండి అంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్న అధికార యంత్రాంగం, ఆ తరువాత రైతులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడానికి ఏమాత్రం ముందుకు రారన్న అభిప్రాయం కూడా రైతుల్లో ఉంది. ఈ నేపథ్యంలోనే స్టాల్స్ ఏర్పాటుపై రైతులు తగినంతగా ఆసక్తి చూపడం లేదు.

పాఠశాలల్లోని ఆయాల జీతాలు పెంచాలి



ధర్నా చేస్తున్న ఆయాలు

రాజమహేంద్రవరం సిటీ: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం కాంటింజెంట్ స్వీపర్లు (ఆయాలు) జీతాలు పెంచాలని సోమవారం రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.పవన్ మాట్లాడుతూ ఆయాలకు ప్రభుత్వం కేవలం 4 వేలు జీతం అందించి వెట్టి చాకిరి చేయిస్తోందని ధ్వజమెత్తారు. 30 ఏళ్లుగా మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈఎస్ఐ అమలు చేయడంతోపాటు రెండు జతల యూనిఫాం, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఫుల్ టైమ్ కంటింజెంట్ వర్కర్స్‌గా వారిని గుర్తించి జీఓ 193 అమలు చేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ జాన్సి, శాంతి, దుర్గ, సత్యవతి, ప్రభావతి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం



శిక్షణ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రధాన న్యాయమూర్తి సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మధ్య వర్తిత్వం, రాజీ ప్రాజెక్ట్ కమిటీ(ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశ మందిరంలో ఎంసీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎంసీపీసీ ఆధ్వర్యంలో హైకోర్టు సూచనలతో మధ్యవర్తిత్వం రాజీ మార్గం అనే అంశంపై జ్యుడీషియల్ అధికారులకు, న్యాయవాదులకు అవగాహన, శిక్షణ అందిస్తున్నట్టు వివరించారు. ఇందులో భాగంగా ఎంసీపీసీ యాక్ట్ 2023 ప్రావిజన్ ప్రకారం జ్యుడీషియల్ అధికారులకు, అడ్వకేట్లకు శిక్షణ అందిస్తామన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి నాలుగు విధానాలు ఉన్నాయన్నారు. ఇందులో మధ్యవర్తిత్వ రాజీ మార్గం, లోక్ అదాలత్ అంశాలుగా ఉన్నాయన్నారు. ఐదు రోజుల శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం



కడియం హైస్కూలు వద్ద పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు



హుకుంపేటలోని పరీక్షా కేంద్రం వద్ద ఎండలో నిలిచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో 16 పరీక్షా కేంద్రాల్లో 3,886 మంది విద్యార్థులకు 3,881 మంది తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలసి గంట ముందే చేరుకున్నారు ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చాలామంది విద్యార్థులు కొంత ఇబ్బంది పడ్డారు.

కడియంలో 928 మంది విద్యార్థులు హాజరు

కడియం: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షకు 928 మంది హాజరు కాగా, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో మణికుమార్ తెలిపారు. మండలం పరిధిలోని 9 హైస్కూళ్లలో 345 మంది బాలురు, 350 మంది బాలికలు మొత్తం 695 మంది ప్రభుత్వ పాఠశాలల నుంచి హాజరయ్యారని తెలిపారు. ఆరు ప్రైవేటు స్కూళ్ల నుంచి 117 మంది బాలురు, 116 మంది బాలికలు మొత్తం 233 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఆయన వివరించారు. వేమగిరి హైస్కూలు నుంచి 96 మంది, కడియపులంక నుంచి 83 మంది, వీరవరం నుంచి 120 మంది, జేగురుపాడు నుంచి 200 మంది, మురమండ నుంచి 215 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు.

మధురం.. మధుసూదన్ గాత్రం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరానికి చెందిన ప్రముఖ గాయకుడు శిష్టు మధుసూదనరావు గాత్రం శ్రోతలను అలరించింది. సోమవారం శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి 74వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆయన ప్రముఖ వాగ్గేయ కారులు త్యాగయ్య, ముత్తు స్వామి దీక్షితార్, మైసూర్ వాసుదేవా చారి, పొన్నై పిళ్లై తదితరులు కీర్తనలను ఆయన ఆలపించారు. సమితి గౌరవాధ్యక్షుడు వాడ్రేవు వెంకటరమణ, చైర్మన్ చింతలూరి సుందర వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జె.సరస్వతి, ఫంక్షనల్ కార్యదర్శి వి.భాస్కర్‌రామ్, ఇతర కార్యవర్గ సభ్యులు కళాకారులను సత్కరించారు. మధుసూదన్ గాత్రానికి హనుమంతు రామ్‌చరణ్ వయొలిన్, కోటిపల్లి సూరిబాబు మృదంగం, రాయప్రోలు బాల దినకర్ ఘటంపై సహకారం అందజేసారు. ఉమా నృత్య నికేతన్ కూచిపూడి నృత్య ప్రదర్శనతో మంగళవారం సంగీత వార్షికోత్సవాలు ముగియనున్నాయి.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

సీటీఆర్ఐ: నగరంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే 200 మంది విద్యార్థులకు సోమవారం రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉపకార వేతనాలు అందజేశారు. సోమవారం చందాసత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చంద సత్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఒను వులమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారి గ్రామోత్సవం, జలాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ప్రజాసమస్యలపై వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు అందజేసిన ప్రజలు, పలు సంఘాల నేతలు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవా మిత్రలు



అర్జీలు స్వీకరిస్తున్న ఏడీసీ రామలింగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు విజ్ఞాపనలు వెలువెత్తాయి. కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు తదితర అధికారులకు ప్రజలు తమ సమస్యలను విన్నవించి అర్జీలు అందజేశారు.

శాటిలైట్ సిటీ గ్రామ ప్రజలకు స్వయం ఉపాధి కల్పించండి

శాటిలైట్ సిటీ గ్రామంలో ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా, చేతివృత్తులు చేసుకునేలా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీశ్రీనివాస్, రూరల్ నియోజకవర్గ కోకన్వీనర్ యానాపు యేసులు కోరారు. బీజేపీ మండలం-2 అధ్యక్షుడు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాటిలైట్ సిటీలో మహిళలకు జీడిపప్పు పరిశ్రమలు ఉండేవని, అవి మూతపడడంతో వారంతా ఉపాధి కోల్పోయారన్నారు. మహిళలకు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కల్పించాలని బీజేపీ నేతలు కోరారు.

దివ్యాంగుల క్రీడాప్రాంగణానికి స్థలం కేటాయించాలి

జిల్లాలో దివ్యాంగుల క్రీడా ప్రాంగణానికి, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఏపీ వీల్‌చైర్ క్రికెట్ టీం, వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్, మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సంఘం సభ్యులు కలెక్టర్ పి.ప్రశాంతికి విన్నవించుకున్నారు. జిల్లాకు చెందిన దివ్యాంగులమైన తాము అంతర్జాతీయస్థాయి క్రీడల పోటీలో పాల్గొని విజయం సాధించిన సందర్భాలున్నాయన్నారు. ఇతర జిల్లాల నుంచి క్రీడల శిక్షణ నిమిత్తం రాజమండ్రికి వస్తామని అనేక మంది దివ్యాంగులు ఫోన్‌చేసి అడుగుతున్నారన్నారు. సాధన, , బస చేయడానికి, సామగ్రి వీల్‌చైర్లు పెట్టడానికి సరైన సదుపాయాలు లేవన్నారు. దయ ఉంచి దివ్యాంగులకు క్రీడా స్థలంతో పాటు కమ్యూనిటీహాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని వారు కోరారు. దివ్యాంగులకు హెల్త్‌కార్డు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రత్యేక హెల్ప్‌లైన్, యూజీ, పీజీ చదివిన వారికి ఉపాధి అవకాశాలు, దివ్యాంగ వాహనాలకు పెట్రోల్‌పై సబ్సిడీ ఇప్పించాలని కోరారు.

ఎన్టీఆర్ వైద్య సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని వైద్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పీజీఆర్ఎస్‌లో విన్నవించారు. వైద్యమిత్రలను డీపీవో కేడర్, ఆఫీస్ అసోసియేట్, టీమ్ లీడర్స్ సమాన అర్హత కలిగిన కేడర్, జిల్లా మేనేజర్లకు డీవైఈవో కేడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగి మరణిస్తే రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజి కల్పించాలన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీఓ

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ కృష్ణనాయక్ అన్నారు.

సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్- మీ కోసం వేదికలో వచ్చిన అర్జీలను డివిజన్‌స్థాయి అధికారులతో కలసి ఆయన స్వీకరించారు.

అసైన్డ్ భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

మువ్వా మంగన్నకు చెందిన అసైన్డ్ భూములను కోనాల తమ్మిరెడ్డి అక్రమంగా ఆక్రమించడాన్ని నిరసిస్తూ, మువ్వా మంగన్న కుటుంబానికి ఆ భూములను తిరిగి అప్పగించాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తదితరులు ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. ఆర్డీఓ కృష్ణనాయక్ సానుకూలంగా స్పందించి, విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, పీడీఎస్‌యూ (వి) జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో రాజమహేంద్రవరంలోని పలు పత్రికలకు సంబంధించిన విలేకరుల ఇళ్ల స్థలాల విషయంలో అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి 32 అర్జీలను స్వీకరించినట్టు మునిసిపల్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు తెలిపారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇతర అధికారులతో కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏడీసీ రామలింగేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈఎం సీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి కోటయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద క్రీడాప్రాంగణం, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలంటున్న దివ్యాంగులు



సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమస్యలు వింటున్న ఆర్డీవో కృష్ణనాయక్



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీఆర్‌సీఎస్ నాయకులు

పీఆర్సీ ఏర్పాటు చేయాలి



కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ధవళేశ్వరం: పీఆర్సీని వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ ప్రశాంతికి ఈ అంశంపై వినతిపత్రం అందజేశారు. ఈహెచ్ఎస్ కార్డుపై క్యాష్ లెస్ వైద్యం పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు పి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి బి సూర్యప్రకాశరావు ఉన్నారు.

రీసెర్చ్ మెథడాలజీపై సదస్సు

సీటీఆర్ఐ: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి అధ్యక్షతన జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ అనే అంశంపై సోమవారం జాతీయస్థాయి సదస్సు వెబ్‌నార్ నిర్వహించారు. ఈ సదస్సులో ఐసీఆర్ విశాఖపట్నం ప్రిన్సిపాల్‌తో పాటు, సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడాన్, డాక్టర్ పాకాల సురేష్‌బాబు అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యాపకులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. జంతుశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ ప్రియాంక, అధ్యాపకులు పాల్గొన్నారు.

లైఫ్ స్కిల్స్‌లో విద్యార్థినులకు శిక్షణ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు నాంది ఫౌండేషన్ మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్, స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ నూజిళ్ల శ్రీనివాస్, శిక్షణకు ట్రైనర్‌గా వచ్చిన వి.చైతన్య, స్కిల్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ బి.వెంకటరావు పలు అంశాలు వివరించారు. బి.వెంకటరావు రచించిన రెండు కెమిస్ట్రీ టెక్స్ట్ బుక్స్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె ఆవిష్కరించారు. శిక్షణను స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనర్ పద్మావతి, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్ పర్యవేక్షించారు.

స్వర్ణాంధ్ర రాంబాబుకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు ఇటీవల ఇన్నర్ వీల్ క్లబ్ వారి డొక్కా సీతమ్మ నిత్యాన్నదాత అవార్డు అందుకోవడం అభినందనీయమని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకర రావు పేర్కొన్నారు. సోమవారం కంబాలచెరువు మున్సిపల్ కాంప్లెక్స్ పట్టణ నిరాశ్రయుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పీఎంపీ అసోసియేషన్ సభ్యులు రాంబాబును సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం పాల్గొన్నారు.

పెయింటర్ మృతి

కంబాలచెరువు: నిచ్చెనపై నుంచి జారిపడి పెయింటర్ మృతి చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. మెరకవీధికి చెందిన బాణాల గణేష్ (38) గోకవరం బస్టాండ్ వద్దనున్న మహాలక్ష్మీ అమ్మవారి గుడి వద్ద పెయింటింగ్ పని చేస్తూ నిచ్చెనపై నుంచి జారి కిందపడిపోయాడు. తలకు తీవ్రంగా గాయం కావడంతో అతడు మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.